# తాపీమేస్త్రి రామదీక్షితులు బి.ఎ.

ఇద్దరూ గోదావరి వొడ్డున తారసిల్లారు.

"మీ దేవూ రండీ?" అనడిగింది, నల్లటావిడ.

"కోనసీమ" అని బదులు చెప్పి "మరి మీ దేవూరు?" అని యెదురడిగింది, యెర్రటావిడ.

"జల్లిసీమ

"మీ పేరు?"

"రత్తమ్మ"

"వైదికులా?"

"అవును - మీ పేరు?"

"సుందరమ్మ"

"నియోగులా?"

"కాదు. వైదీకులమే"

అప్పటి కిద్దరూ కత్తిరివాడ్డు దిగారు.

"మీ రిక్క డెందుకున్నారూ?" అనడిగింది రత్తమ్మ.

"మా అబ్బాయి వుద్యోగం కోసం వచ్చాం"

"దొరికిందా?"

"ఇంకా లేదు"

"ఎన్నాళ్ళయిందీ మీరు వచ్చి?

"నిన్ననే నండి. మీ రెందుకు వచ్చారూ?"

"మేమూ మా అబ్బాయి వుద్యోగం కోసమే—నిన్ననే వచ్చాం. అయితే, మీకిల్లు దొరికిందా?"

"ఆ, దొరికింది. ముట్లగదీ, దానికి చేరివున్న వసారా యిచ్చా రెనిమిది రూపాయలు కట్టి"

"మాకూ దొరికింది. స్నానాల గదీ, పుడకలూ పిడికలూ పెట్టుకునే పంచపాళీ ఇచ్చారు, ఆరురూపాయలకు"

సుందరమ్మ బుగ్గలు నొక్కుకుంది, గాజులు గలగలలాడేటట్టు చెయ్యి కొంచెం వూపుకుంటూ.

గాజులు గలగలా ఆడాయి, మిలమిలా మెరిశాయి, అవి చూసి రత్తమ్మ కళ్ళు జిలజిలా మన్నాయి.

"నాలుగు జతల బంగారు గాజులు. ఇంకా యెన్ని నగలున్నాయో మరి? పెట్టిపుట్టింది" అనుకుం దామె.

చివరి కామె "మీ రెంతమందీ?" అనడిగింది.

"ఇద్దరు కొడుకులూ నేనూను. పెద్దబ్బాయి బి.ఏ. అతని వుద్యోగం కోసమే వచ్చాం. చిన్నబ్బాయికి తొమ్మిదోయేడు"

"నా కొక్క కొడుకూ కూతురూను" అంటూ అందుకుంది రత్తమ్మ.

"మాఅబ్బాయికూడా బి ఏ అతని రెక్కమీద బతకడానికే మేము వచ్చాం. మాఅమ్మాయికి పదోయేడు వెడుతుంది, రేపు కార్తీక పున్నమికి"

ఇది వింటూనే, మెడ బిగిసిపున్నట్టు నటిస్తూ, సుందరమ్మ పైట కొంచెం సడలించుకుంది.

దాంతో, మెడకిందిబట్ట కొంచెం దిగజారింది.

వెంటనే రెండుపేటల గోవర్ధనం గొలుసు జిగాల్మంది.

అది చూసి రత్తమ్మ చకిత అయింది.

అది గుర్తించి సుందరమ్మ వెన్ను విరుచుకుంది.

"మీ అబ్బాయికి పెళ్ళయిందా?" అనడిగింది రత్తమ్మ.

"ఆ, పదహారో యేడు వెళ్ళకుండానే అయింది పెళ్ళి. కోడలికిప్పుడు, మూడోనెల కూడానూ"

"బాగుంది ఉద్యోగస్థుడయేటప్పటికి కొడుకు పుడతాడు. అదృష్టవంతుడు"

"మరి మీ అబ్బాయికి పెళ్ళి——"

"ఇంకా చెయ్యలేదండీ"

"చెయ్యలేదంటే?"

"ఆదిలో, బి.ఏ. అయితే గాని పెళ్ళి చెయ్యనని తండ్రి వ్రతం పట్టారు. ఉద్యోగం దొరకేదాకా పెళ్ళి వద్దని నా నాయనే పట్టు పట్టుక్కూచున్నాడు, తరవాత"

"కాకపోయినా, పెళ్ళిచెయ్యడం మాటలా?" అంది సుందరమ్మ, కళ్ళు తిప్పుకుంటూనూ, తన చేతి రాళ్ళ వుంగరం చూసుకుంటూనూ.

ఆ వుంగరమున్నూ చూసింది రత్తమ్మ.

"ఒక్క జత అయినా నాకు బంగారుగాజులు చేయించాలనీ, తమకిలాంటి వుంగరం చేయించుకోవాలనీ యెంతో ముచ్చటపడేవారు, నా మహారాజు" అనిన్నీ అనుకుందామె.

అప్పటి కిద్దరూ రేవు చేరుకున్నారు.

రత్తమ్మ బిందెలో వున్న బట్టలు తీసి, తడిపి, రాతిమీద పడేసి, నీళ్ళందేటట్టుకూచుని బిందె తోమసాగింది.

సుందరమ్మ, బిందె బోర్లించి దానిమీద కూచుని "మీకేమన్నా భూమి పుట్రా -" అని మాట తేల్చేసింది.

"భూములు నాడేలేవు. కొంపతెగనమ్మి నాయనికి చదువు చెప్పించాను నేను" అని బదులు చెప్పింది రత్తమ్మ.

"మా కేమాత్రమో వున్నాయి సుమండీ! అయితే మాత్రం కూచుని తినమా? అంచేత వచ్చాం మేముద్యోగంకోసం" అని చెప్పి సుందరమ్మ, మొగం పక్కకి తిప్పుకుని కళ్ళు చికిలించుకుంది.

క్షణంలో మళ్ళీ యిలా చూస్తూ "మీకెన్నాళ్ళయిందీ ఈ మోగం పట్టి?" అనడిగింది.

"మూ డేళ్ళయిందండీ! కలరా వచ్చి యెత్తుకుపోయింది నా దేవుణ్ణి. ప్రయి వేట్లుచెప్పి పోషించేవారు మమల్ని"

"నాకూఅంతే ఆయింది. ఆసుపత్రి మింగేసిందాయన్ని"

అప్పటికి బిందె తోమడం అయిపోగా, రత్తమ్మ, తన పంచా కొడుకు పంచా కూతురి పరికిణీ వుతుక్కోసాగింది.

వెంటనే సుందరమ్మ, రెండు చేతులతోనూ నీళ్ళు చిమ్ముకుంటూ "బాబోయ్, బాబోయ్" అని యెగిసెగిసిపడుతూ మొలలోతుకి వెళ్ళి నుంచుని "అబ్బ! చలిచలి, వేన్నీళ్ళేగాని యెరగనైతిని నిన్నటి దాకా" అంటూ కంఠం దాకా మునిగిలేచి వొళ్ళు తోముకోసాగింది.

## 2

ఎలెక్ట్రిక్కు కార్పోరేషన్ దగ్గిర యెదురుపడి సినీమాకేనా వెడుతున్నారు?" అనడిగింది, సుందరమ్మ.

అప్పుడే విప్పిన గ్లాస్కోమల్లు మడత కట్టుకుని, సువాసన నూనె రాసుకుని తల చక్కగా దువ్వుకుని, జారుముడి వేసుకుని వుందామె.

రత్తమ్మ కట్టుకున్న దిన్నీ చాలా పరిశుభ్రంగానే వుంది; కాని, అది నీరుకావి పంచె.

ఆమె కూడా తలదువ్వుకుని జారుముడి వేసుకునే వుంది.

"కాదండీ, నేనున్న విద్యమానంలో నాకు సినీమా కూడానా? మార్కండేయస్వామిగడికి వెడుతున్నాను"

"మీ అబ్బాయి కేమయినా వుద్యోగం—"

"ఇంకా దొరకలేదండీ! కాని, ఉద్యోగం ఆశ వొదులుకున్నాడు నానాయన. మరి మీ అబ్బాయికి దొరికిందా?"

"ఎందరెందరో యిస్తాం రమ్మన్నారు; కాని మావాడే వొప్పుకోలేదు"

"అదేం?"

"దిక్కుమాలిన వుద్యోగాలు కానీ - ఈ వుద్యోగాలిచ్చే వాళ్ళకి, అగత్యమే కాని బుద్ధివున్నట్టు లేదండీ

"ఏం జరిగిందేమిటి?"

"ఒక జమీందారన్నాట్ట - ఇచ్చేది పదహేను రూపాయిలుట సుమండీ, ఇంతాచేస్తే. కాని రాత్రింబగళ్ళు తనని కనిపెట్టుకొని వుండాలిట, చుట్టలూ సిగరెట్టలూ నోటికందిస్తూ. పైగా, సంవత్సరందాకా జీతం యెక్కువ చెయ్య

మని అడగననీ, రెండేళ్ళకి తక్కువ కాకుండా నౌకరీ చేస్తాననీ రాసికూడా యివ్వాలిటండోయ్"

"ఆయనే కాబోలు, నానాయనతోనూ అలాగే అన్నాట్ట"

"ఇంకో వర్తకుడున్నాట్ట. కానయితే యిరవై రూపాయిలిస్తాడుటలెండి. అయితే, నెలకిరవై దినాలు సికిందరాబాదనీ, శ్రీకాకుళం అనీ, బందరనీ తిరుగుతూ వుండాలిట. ఊళ్ళో ఉండిన పద్దినాలూ తన యింటోకూచుని వుత్తరాలకు నకళ్ళు రాయాలిట, విన్నారా?"

"నా నాయనతో అటు కర్నూలు దాకానూ, యిటు భద్రాచలం పైకీ కూడా వెడుతూవుండాలన్నాట్ట ఆయనే కాబోలు"

"మరో పెద్ద ఆస్తిపరుడున్నాట్టండి! 'వడ్డీ కట్టడంచేతవునా?, అనడిగాట్ట - బి.ఏ.ని అదా అడగడం చెప్పండీ, పోయేకాలం కాకపోతే? తీరా, అందుకయినా సరే అని సిద్ధపడితే—"

"జీతం లేకుండా మూడుమాసాలు పనిచెయ్యాలన్న మాటేనా మీరు చెబుతున్నది?"

"మీ అబ్బాయికి అయిందే అది?"

"ఆ"

"ఇంకోటి కూడా అన్నాట్ట, మీ అబ్బాయి చెప్పాడో లేదో మరి' తనకొడుక్కీ తనమనమడికీ యింగ్లీషుకూడా—"

"అదెందుకో తెలుసా?"

"వాళ్ళకి యింగ్లీషురాకపోతే 'మనకి ఇంగ్లీషుగుమాస్తా యెందు కంటారుటండీ, చూశారా?"

"డబ్బున్న వాళ్ళెన్ని చిలకపలుకు లయినా పలుకుతారు, చూసేం చెయ్యగలమూ మనమూ?"

"చూసేం చెయ్యగలమా? వాళ్ళకే వుందా మహా! ఊరికే కూచోడం యెందు కనిగానీ — మా యింటో కాఫీ ఖర్చుకి చాలదు, వాడిస్తా నన్నది, తెలుసా మరి?"

"మీ మాట యేమోగాని, మాకు మాత్రం కొన్నాళ్ళ పాటు అది మహామేరు వయి వుండేది; కాని రాత్రిళ్ళు, తరుచు, తన యింటి దగ్గిర పడుకోడం కూడా తప్ప దన్నాట్ట కాదూ?"

"మరేటండోయ్! కళ్ళూ కాళ్ళూ మన్నుతాయా ఆ అబ్బికీ? బ్రాహ్మణ పిల్లాడు - బి. ఏ. - తన యింటికి కాపలా వుండడమా?"

"అలా వుంది కాలం"

"ఎవరో సినిమావాళ్ళు టండీ! రాత్రి వొంటిగంటదాకా రెండాటలకూ కథ చెప్పాలన్నారుట. తడికలు పుచ్చుకుని కుర్రాళ్ళు వీధివీధికీ సరిగా తిరుగుతున్నారా లేదో చూడడానికి, మధ్యాహ్నంపూట అంతా వాళ్ళ వెనక వెనకనే తిరుగుతూ కూడా వుండాలిట. మరి జీతం—"

"ఇరవయ్యేగా!"

"మీ అబ్బాయి వెళ్ళాడూ, అక్కడికి?"

"వెళ్ళా డమ్మా, వెళ్ళాడు"

"ఒక ప్లీడరుటండీ? తన కొడుకులకు రాత్రీ పగలూ ప్రయివేట్లు చెబితే అన్నం పెట్టి బట్ట యిస్తాడుట. తనకేకాని మరెవరికి కుటుంబం లేదనుకున్నాడు కామోసు వెర్రినాయన"

"ఆయనే కాబోలు! మావాడికి, జీతమే కావాలంటే పదిహేను రూపాయి లిస్తానన్నాట్ట; కాని తనకోసం, కోర్టుకి కాఫీ పట్టుకువెళుతూ వుండాలిట"

"బ్రాహ్మణ జన్మేనా వాడిదీ?"

"................................"

"నవ్వుకొని వూరుకుంటే కాదండీ! ఇలాంటి వాళ్ళకి తగినట్టు గడ్డి పెట్టకపోతే యింకా పెచ్చిపోతారండీ"

"ఎవరో వొకరు పెట్టకపోరు, మన కెందుకూ?"

"ఇంకో వర్తకు డున్నాట్ట. బ్రాహ్మడేట. కొత్తగా కూరల అంగడి పెట్టాడుటండీ. ఊళ్ళో యింటింటికీ తిరిగి, కూరలు కొనుక్కునే వాళ్ళని అందరినీ తన అంగడికి మళ్ళించాలిట. అలా మళ్ళిస్తే - ఆ వచ్చిన వాళ్ళు తనపేరు చెబితే - వాళ్లు కొన్న కూరలలో వచ్చే లాభంలో నూటి కయిదు రూపాయిలు—"

"కావడి బుజాన వేసుకుని వూళ్ళో తిరిగి అమ్ముకురావాలనలేదు, నయమే కాదూ?"

"బాగా చెప్పారు. మరి మీ అబ్బాయి ఏమిచేశాడూ?"

"ఏటి కడ్డపడ్డా డండీ"

"అంటే?"

"ఆదిలో, దినాని కొక రూపాయి కిడుతుం దనుకున్నాట్ట; కాని, వొక వారం అయింది ప్రవేశించి, పదిరూపాయలు వచ్చా యంటూ పొంగిపోతూ పట్టుకు వచ్చాడు నా నాయన"

"మావాడు చిల్లరపనులు చెయ్యడు సుమండీ! పుట్టింది బ్రాహ్మణ పుట్టుకాయె. ఆపైని బి.ఏ. కూడాను. అసలు, మాకు లోటూలేదు. మంచిపని దొరికితేనే, ఎప్పటికైనా"

"మీ కేమమ్మా బంగారు పిచికలు. మరి వెడతా, స్వామి దర్శనం చేసుకుని, నా నాయన యింటికి వచ్చాటప్పటికి వంట చెయ్యాలి"

"నేనూ వెళ్ళాలి, ఆలస్యం అయితే టిక్కట్లు దొరుకుతాయో లేదో? ఏదో కొత్త ఫిలిం వచ్చిందట. ఇక అవి ఫేషన్లు కావుట, పాటలు కావుట, నృత్యాలు కావుట – బాబోయ్..............."

## 3

ఇద్దరూ మార్కండేయస్వామి గుడిదగ్గిర కలిశారు.

"గుళ్ళోనుంచి వస్తున్నారా?" అనడిగింది రత్తమ్మ.

"లేదండీ, బజారుకి వెళ్ళాను, గ్లాస్గో మల్లుతానులు రెండో మూడో పుచ్చుకుందా మని. రేపు రమ్మన్నాడు వర్తకుడు ఇలా తిప్పడమే కాదు, వొక్క తానుకంటే ఎక్కువ యివ్వడుట. ఇక ముందు దొరకడమే కష్టంటండీ"

"ధర పెరిగిపోయినందుకే యిబ్బందిగా వుండగా, అదోటి కూడానా?"

"ఏమి చెప్పకోనండీ? ఆదికాలాన, నేను, మధుర చీరలూ, బెంగుళూరి చీరలూ, కంచి చీరలూ, పుల్లంపేట చీరలూ, ఉప్పాడ చీరలూ తప్ప మరొటి యెరగను. ఈయోగం పట్టాక, కొన్నాళ్ళ నుంచి గ్లాస్గోమల్లు కడుతున్నాను, ఇక ముం దెలాగో మరి?"

"చిక్కగానే వుండేటట్టుంది. వద్దు వద్దు అంటూ వుంటే, నిన్న చెల్లెలికి నాలుగు పరికిణీ గుడ్డలూ, నాలుగు చొక్కా గుడ్డలూ, నాకోసం మూడు మెట్టూరుమల్లు పంచెలూ తెచ్చి పడేశాడు మా నాయన. మీరన్నట్టు, ముందు ముందు దొరకడం కష్టమేట"

"బాగా కిడుతోంది కామోసునేం?"

"ఆ, స్వామి దయవల్ల, చెప్పవద్దూ? రెండు వారాలనుంచి నా నాయన దినానికి రెండున్నర సంపాదిస్తున్నాడు"

"దినానికి రెండున్నర తెస్తున్నా డంటే జ్ఞాపకం వచ్చింది. విన్నారా? ఎవరో బ్రాహ్మణపిల్లాడుటండీ: బి. ఏ. కూడానుట; కాని శూద్రకుర్రాడు లాగ తాపీపని చేస్తున్నాడుటండీ, మావాడు చెప్పి యెంతో యిదయాడు, అదేం కర్మమండీ?"

"..........అయితేనూ? మీచేతిని గాజులు రెండుజతలే కనపడతాయేం? నాలుగు జత లుండేవి కాదూ?"

"ఉండేవి, నిజమే – ఇప్పుడూ వున్నాయి; కాని బరువనీ, దినమ్మూ యెందు కనీ రెండు జతలే పెట్టుకుంటున్నాను, ఊరు పాతబడింది కనక"

ఇలా అంటూనే సుందరమ్మ, పైటచెంగు కంఠం చుట్టూ సవరించు కుంది, బాగా కమ్మేటట్టు,

దాంతో, ఆలోక్యం కనిపెట్టేసి, రత్తమ్మ "అదేం, గోవర్ధనం గొలుసేదీ?" అనడిగేసింది.

"సరదాపడితే మా చిన్నబ్బాయి మెడలోవేసి వచ్చాను" అంది సుందరమ్మ, మొగం వంచుకుని,

"మీ అబ్బాయికి వుద్యోగం—"

"చెప్పు లరిగేలాగ- చెప్పులంటే బూడ్సులు సుమండీ! మావాడు దేశవాళీ చెప్పులు తొడుగుతాడా మరీ? అవి అరిగేలాగ తిరుగుతున్నాడు. కాళీలూ వున్నాయిట కావలసినన్ని; కాని వొక్కటీ దర్జా అయింది కాదుట. చూస్తూ చూస్తూ నాసిరకం పనిలో ప్రవేశించడం యెలాగండీ, బియ్యే అయాక కూడానూ."

"మనస్కరించకపోతే యెలాగా ప్రవేశించడం?"

"కానయితే, రెండు నెలలు పూర్తికావస్తోంది ఇక్కడికి వచ్చి అయినా—"

"కష్టమే, ఉప్పుతో తొమ్మిదీ కొనుక్కోవాలి, డబ్బుపెట్టి. అయినా, వొక్కటీ మంచిది దొరకదు. నెయ్యీ మజ్జిగా చూస్తూన్నారా?"

"బాధగానే వుందండీ"

"అన్నట్టు, మీ కోడలికి గాజులు పెట్టించారా?"

"విన్నారా? అయిదోమాసం రేపటితో వెడుతుంది. సంతోషంకొద్దీ నెల తప్పగానే రాశాం. వెంటనే వచ్చి పుట్టింటివారు తీసుకు చక్కాపోయారు. వారే పెట్టించుకుంటా రనుకున్నాం గాజులు. ఇంతకీ, ఎంతగతి కడుక్కుపోయినా గాజులు పెట్టించుకోడం పుట్టింటివారే. అవునంటారా కాదంటారా చెప్పండీ"

"లోక ధర్మం అంతేగా?"

"మా అబ్బాయి, పెళ్ళాన్ని విడిచి క్షణం వుండలేడు. వారానికోమాటు వెళ్ళి వారందినాలుండి వస్తూనే వుంటాడు. మొదటే వాడితో చెప్పుకోవచ్చునా? చెప్పుకుంటేసిగ్గు - తీరా, అయిదోనెల వెళ్ళిపోతుందనగా, నాలుగుదినాల కిందట వాడితో పంపేసి వూరుకున్నారు"

"అదేం?"

"వారికి ఆనవాయితీ లేదుట"

"పా-పం"

"పాపమో పుణ్యమో వారు చేసిం దదీ. దానిమీద రెండుచేతులా నోరు మూసుకుని మేమే పెట్టించుకున్నాం నిన్న, మాకు తప్పుతుందిటండీ?"

"ఎలాగో వొకలాగ లాంఛనాలు——"

"ఎలాగో వొకలాగ యేమి కర్మం, రాజాగా జరిగించుకున్నాం, మాకు మాత్రం తీరవద్దుటండీ?"

"అదే నేనన్నదీని. అయితే, తల్లీ తండ్రీ——"

"రానూ వచ్చారు. గాజులు పెట్టించిన ఉత్తరక్షణాన తీసుకునీ వెళ్ళారు. మళ్ళీ"

"అయ్యో, అంత తొందరయేమీ? ఇవాళ తీసుకువెళ్ళగూడదూ?"

"నేనే కాదు, ఇరుగూ పొరుగూ కూడా అలాగే అడిగారు, వింటేనా?"

"మరి మీ అబ్బాయి——"

"అయితే, నేనూ వస్తాను పదండి అంటూ వెంటపడ్డాడు మావాడు, మనలో మనమాట, మావాణ్ణి నేనే పంపించాను సుమండీ!"

ఇలా అని, సుందరమ్మ, ముక్కూ మూతీ తిప్పుకుంటూ చురుగ్గా చూసింది.

"తెలిసింది కాదు, నిన్ననే వచ్చి మీకోడల్ని చూస్తును" అంది రత్తమ్మ.

"చూద్దురుగాని, చూద్దురుగాని - మరిపోవాలి. ఇవాళ చింతామణి నాటకంట. పెందిరాడే రెండు మెతుకులు నోట్లో వేసుకుని - నా చిన్నకొడుకు గంటనుంచి తొందలు విడిపిం చేస్తున్నాడు."

ఇలా అంటూనే సుందరమ్మ తుర్రుమంది.

రత్తమ్మ, ముందు రిచ్చపడి, తరవాత గుడికి వెళ్ళింది.

## 4

ఇద్దరూ మిషన్ ఆసుపత్రి ఆవరణలో యెదురుపడ్డారు.

"ఇలా వచ్చారేం?" అనడిగింది సుందరమ్మ.

"మా బంధువుల్లో వొకమ్మాయికి రాకరాక కడుపు వచ్చింది. ఎందుకయినా మంచిదని పురిటికి ఆసుపత్రికి వచ్చారు. చూసి వస్తున్నాను"

"పురుడు వచ్చిందా?"

"ఆ, నాలుగు దినాలయింది వచ్చి, గుమ్మడి పండువంటి పిల్లాడు పుట్టాడు. పుట్టింటివారూ, అత్తంటివారూ పొంగిపోతున్నారు, పెన్నిధి అబ్బినట్టు"

"అబ్బరమా? అయితే, అందరికీ అలాంటి పుట్టింటివారు దొరకవద్దూ?"

అదేమిటండీ, కూతురు బాగుచూసి ఆనందించని పుట్టింటివారుంటారా లోకంలో?

"అయ్యో, అడిగారూ మా వియ్యాలవారి సంగతి?"

"అదేమిటండీ?"

"అదేమిటంటే? మాకోడలికి వొళ్ళంతా నీరుపట్టింది. అక్కడి డాక్టరు భయపెట్టాడు. తీసుకువచ్చి మాయింటిమీద పడేశాడు తండ్రి"

"పురుడు వచ్చిందా?"

"ఇంకాలేదండీ! తల్లీ తండ్రీ మాత్రం వచ్చి మా నెత్తిమీద కూచున్నారు, కోరి వింత వింత కూరలూ పచ్చళ్ళూ చేయించుకుంటూ"

"శాబాసు"

"కూతుర్ని కనిపెట్టికుని తల్లీ, గోదావరి రేవులు కనిపెట్టుకుని తండ్రీ కూచుంటారు. ఎక్కడో పనికిమాలిన సంబంధం వచ్చిపడింది మాకు, చచ్చిపోతున్నాను, వారిని కూచోపెట్టి మేపలేక"

"మీ అబ్బాయికి వుద్యోగం—"

"ఇంకా దొరకలేదండీ! ఏమిటేమిటో వున్నాయి; కాని మావాడు పెద్ద మనుష్యుల దగ్గరే కాని — అదయినా దర్జాగా కూచుని పురమాయింపులు చేసే పెద్ద గుమాస్తాపనే కాని చెయ్యడండీ! నాలుగు రాళ్ళు పైగా కూడా దొరుకుతూ వుండాలి. అలాంటిది వచ్చినప్పుడే అని చూస్తున్నాడు"

"మా కలా సాగదండీ మరీ! మా అబ్బాయి యేటికడ్డ పడ్డాడు సుమండీ, దినానికి మూడు రూపాయిలు తెస్తున్నాడిప్పుడు. ఎవరో పెద్దరెడ్డిగారుట, పెద్ద పెద్ద కంట్రాక్టులు చేస్తూ వుంటారుట వారు. నాలుగులక్షలకు వొప్పుకుని పెద్ద ఆసుపత్రి కట్టిస్తూన్నారు టిప్పుడు. జీతానికి రమ్మంటున్నారు వారు పైని వుండి పనులు చేయించడానికి నా నాయన్ని"

"కూలీల మీద మేస్త్రీ పనా?"

"ఏమిటో చెప్పాడు, ఆపేరు జ్ఞాపకం లేదు. కానీ — నువ్విలా రా తల్లీ! ఇది నాచిట్టితల్లి. మీరు మార్కండేయస్వామి గుడి దగ్గిర కనపడ్డారూ? ఆవేళ, మధ్యాహ్నం యెండవేళ, యెవరో వొకావిడ రెండు జతల గాజులూ, గోవర్ధనం గొలుసూ అమ్ముకుందిట బజార్లో. అప్పు డక్కడే వుండిన మా

అబ్బాయి, పాతికరూపాయీల లాభంయిచ్చి అవి కొనేశాడు. ఇదిగో, ఆగాజులు, చెరిపించి దీనికి రెండుజతలు గాజులూ, మిగిలిన బంగారంతో చెవులకు దుద్దులూ లోలకులూ. ముక్కుకి బేసరీ నిమ్మగుత్తీ చేయించాడు. గొలుసు మెరుగు పెడుతున్నాడు పనివాడు"

"డబ్బంతా యిప్పుడు కూలీలదేనండీ, ఏం. చేయించక?"

"..............అదేం, మీచేతిని వుంగరమూ, తక్కిన గాజుల జతలు రెండూ కనపడవేం?"

"అలాంటివి చూస్తే ఆసుపత్రివాళ్ళు డబ్బు దోచేస్తారు. అంచేత, తీసి దాసివచ్చాను"

"రాత్రి యిక్కడ పడుకోవాలి కాబోలు, పాపం పాత బట్టలతో వచ్చారు"

"అవునండి"

"కోడలి కేమయినా సుఖవుగా వుందా?"

"ఏం, వుండకా? వారం దినాలకీ సూదిమందుకే తొంభై రూపాయి లయినాయి. సుఖవుగానే తిరుగుతోంది, యివాళో రేపో పురుడు వస్తుం దంటోంది దొరసాని"

"మంచి ముహూర్తాన మీ అబ్బాయి కొమాళ్ళ తండ్రి కావాలి. మరి వెడతానండీ"

"నడుస్తూ వుండండి. నేనూ వస్తాను. స్థానమూ, గగ్గయ్యా వచ్చారుట సావిత్రి ఆడడానికి. ఇది తప్పితే మళ్ళీ యెన్నాళ్ళకో గాని దొరకరు"

రత్తమ్మ తెల్లబోయింది. చేసేది లేక చక్కాపోయింది.

## 5

ఇద్దరూ జయాటాకీసు ప్రక్కన కలుసుకున్నారు.

రత్తమ్మ, తెల్లని మల్లుపంచ కట్టుకుని వుంది.

ఆమె మెడలో గోవర్థనం గొలుసూ, చేతులకు బంగారు గాజులూ మిలమిల మెరుస్తున్నాయి.

ఆమెకూతురు, పువ్వుల పరికిణీ, గళ్ళ ఫ్రాక్కూ తొడుక్కుని వుంది.

ఆమెకున్నూ, చేతులకు గాజులూ, చెవులకు దుద్దులూ లోలకులూ, ముక్కులకు బేసరీ నిమ్మగుత్తీ వున్నాయి.

సమీపాన, రత్తమ్మ కొడుకు ఎవరితోనో మాట్టాడుతూ నుంచున్నాడు.

సుందరమ్మ, మాసికలు వేసిన పాతపంచె కట్టుకుని వెల వెలపోతున్న ట్టుంది; కాని రత్తమ్మవి చూసి గాంభీర్యం తెచ్చుకుంది.

ఆమె చిన్నకొడుకు, జంతికల దుకాణం దగ్గిర నుంచుని తల్లికేసి చూస్తూ ఊటలూరుతున్నాడు.

"అదిగో, సూటువేసుకుని దొరటోపీ పెట్టుకున్నాడూ అతనే నండీ నా నాయన! రెడ్డిగారు నెలకి నూట యాభై రూపాయి లిస్తున్నా రిప్పుడు" అంది రత్తమ్మ.

"కూలీల మీద మేస్త్రీకి అంత జీతం యిస్తారా యెక్కడైనా?" అనడిగింది సుందరమ్మ, బుగ్గను నొక్కుకుంటూనూ కళ్ళు తిప్పుకుంటూనూ.

"మేస్త్రీ కాదు, సూపరైవ్జరుగా?"

"తాపీ పనివాడి కంత మంచి ఉద్యోగం యిస్తారా యెవరయినా?"

"అంత మంచిపని యిస్తారా" అని వింతా, "అంత పెద్ద జీతం యిస్తారా" అని ఆశ్చర్యమూయెందుకూ? అది మనిషి బుద్ధిని పట్టీ, తాహతుని పట్టీ, నడతని పట్టీ వుంటుంది. ఆ రెడ్డిగారి దగ్గిరే - వొక బ్రాహ్మణపిల్లాడు — బి.ఏ, కూడానుట — అట్టెండరుగా చేరాట్ట ఆరుమాసాలు తిరిగితిరిగి నౌకరీ దొరక్క. ఎవరికో యెస్టిమేటు కాగితంయిచ్చి, వివరాలు చెప్పి, జవాబు తొరగా పంపమన్నారని చెప్పిరమ్మన్నారుట రెడ్డిగారు. అంటే, ఆ బ్రాహ్మణ బి.ఏ. 'నే నలాంటి నామోషీపనులు చెయ్య' నన్నాట్టండీ! అదేమిటండీ, అట్టెండరుగా చేరాక మిడిసిపాటు కాకపోతే?" అని ముదలకించి చురుగ్గా చూసింది రత్తమ్మ.

"ఏమో నే నేమెరుగుదునూ?" అంది సుందరమ్మ, మొగం పక్కకి తిప్పేసుకుని.

"అప్పు డక్కడ వొక పెద్దమనిషి వున్నా ట్టండీ!" అంటూ మళ్ళీ అందుకుంది రత్తమ్మ, మరికాస్త దగ్గిరసావెళ్ళి.

"ఆయన, ఆపిల్లాడి పుట్టుపూర్వోత్తరా లన్నీ యెరుగునట. ఇంతా చేస్తే, ఆ అబ్బాయి తండ్రి వంటబ్రాహ్మడు టండీ! ఎందుకో ఆపరేషను చేయించు కుని, చీము పట్టగా విషమించి, ఆసుపత్రిలో దిక్కుమాలినచావు చచ్చాడుట అతని తండ్రి. ఆ అబ్బాయి తల్లి, మొగు ణ్ణెప్పుడూ సనిపెట్టలేదుట. సినీమా తార ల్లాగ వేషాలు వేసుకుని షష్టిగడియలూ వూరమ్మట తిరుగుతూవుండేది టావిడ. ఒకమూల, మొగుణ్ణి, ఆసుపత్రిలో కిందికి దింపుతూ వుండగా, మరో మూల, ఆవిడ, నాటకశాల దగ్గిర టిక్కట్టుకోసం స్వయంగా యెగబాకు

తోందిట. ఇద్దంతా యేకరువుపెట్టి, 'ఎస్టిమేటు పట్టుకు వెళ్ళడం నీ బతుక్కి నామోషీ అయిందా' అని డెకారించాట్ట, ఆపెద్దమనిషి, ఆపిల్లాణ్ణి. దీనిమీద రెడ్డిగారు 'నువ్వింక మా కక్కర్లేదు, దయచెయ్యి' అని సాగనంపేశారుట ఆపిల్లాణ్ణి. బ్రాహ్మడయితే మాత్రం, నీతీ జాతీ లేకపోయాక పూజిస్తారుటండీ లోకులూ"

సుందరమ్మకి మాట రాలేదు.

కాలి బొటనవేలితో నేలమీద రాస్తూ మొగం వంచేసుకుం దామె.

అప్పుడు, సుతారంగా తల పంకించుకుని, రత్తమ్మ "ఆవేళా? మనం ఆసుపత్రిలో కలుసు కున్నామూ?" అంటూ మళ్ళీ అందుకుంది.

"అక్కణ్ణుంచి నే నింటికి వెళ్ళాటప్పటికి, నా నాయన రెండు జతల బంగారు గాజులూ, వొక రాళ్ళ వుంగరమూ కొనుక్కువచ్చాడు. అంత కితమే యెవరో వొకావిడ అమ్ముకుందిట అవి. మళ్ళీ పాతిక రూపాయిలు లాభం యిచ్చి అవిన్నీ కొనేశాడు నా నాయన. 'పెళ్ళిలో, నీ పెళ్ళానికి పెట్టుకుందువు గాని దాచుకో నాయనా' అన్నాను నేను; కాని యెంత చెప్పినా నా మాట వినక 'నేను నాన్నబదులూ నీబదులూ నిన్నే సంతోషపెట్టాలి. నా పెళ్ళినాటికి నేను మళ్ళీ సంపాదించుకో లేకపోను, నువ్వే పెట్టుకో' అని గాజులూ గోవర్ధనం గొలుసూ నేను పెట్టుకునే దాకా బలవంతం చేశాడు నా నాయన. ఇవిగో చూశారా?"

ఇలా అడుగుతూ వొకచేత గొలుసు యెత్తిపట్టుకుని, గాజులు కనపడ్డాని కొక చెయ్యి ముందుకి చాపి, మరీ దగ్గిరసా వెళ్ళింది రత్తమ్మ; కాని సుందరమ్మ కిక్కురుమనలేదు.

రత్తమ్మకి చిరునవ్వు వచ్చింది; కాని అది అపుకుని ఆమె "నేను నా నాయన మాట తీసెయ్యలేకపోయానండీ! ఉంగరం మాత్రం నాబలవంతాన అతనే పెట్టుకుంటున్నాడు సుమండీ! మొలిచినట్టు సరిపోయింది అతని అనామిక కడి. అతను సొంతంగా చేయించుకున్నట్టే అమరింది అది. మార్కండేయ స్వామి దయవల్ల మాకికలోటు లేదు. నా నాయనకి, వెయ్యి నూటపదహార్లూ వెండి చెంబూ వెండి కంచమూ పట్టుతాపితాలూ యిస్తామనీ, నాకూ నా చిట్టి తల్లికీ చెరో నూటపదహార్లూ తక్కిన లాంఛనాలూ యిస్తామనీ—యెవరో కాకినాడ కాలేజీలో ప్రొఫెసరుట, తన కూతుర్ని చేసుకోమంటూ నిన్ననే వచ్చారు. ఏలూరినుంచి, ఆయన వుండగానే "రేపు పెళ్ళికొడుకు చూపులకు వస్తున్నా"మని గుమాస్తాచేత కబురు పేశా రొక ప్లీడరుగారు. తొందర ఎందుకని మే మింకా

యెవరికీ మాట యివ్వలేదు. ఇద్దరు పిల్లలూ రజస్వల అయిన వాళ్ళేట. బంగారు బొమ్మలు కూడానుట. ఏలూరిపిల్ల బాగా పాడుతుందిట గాని, కాకినాడపిల్ల ఎలాంటి పురాణమూ కూడా ఎంచక్క చెబుతుందిట. నా నాయన పెళ్ళికి మీరు తప్పకుండా రావాలి సుమండీ ? ఏదీ, నాయనా, యిలా రావోయ్, బాగుం దేమో చూస్తారు, నీ వుంగరం వొకమాటు సుందరమ్మగారికి చూపించూ. పాపం, మన మంటే యెంతో అపేక్ష ఈవిడకు" అంది కళ్ళు చికిలించుకుంటూ.

సుందరమ్మ మొగం యెత్తలేదు.

ఇటయినా తిప్పలేదు.

మాట్లాడలేదు.

నుంచోనే లేదు.

ఒక్క అంగలో వెళ్ళి చిన్న కొడుకు రెక్కపట్టుకుని వొక్క గుంజు గుంజింది ఆమె.

ధుమధుమ లాడుతూ, వాణ్ణి బరబరా యీడ్చుకుపోతూ రెండో అంగలో నాళంవారి సత్రం దాటేసింది.

చిరునవ్వు నవ్వుకుంటూ, తల పంకించుకుంటూ, చూస్తూ వూరుకుంది రత్తమ్మ.

అప్పటికి తల్లి దగ్గిరికి వచ్చి, తాపీమేస్త్రి రామదీక్షితులు బి. ఏ., ఇదేమిటో అర్థం కాక, తల్లిని విడిచి సుందర్మనీ, సుందరమ్మని విడిచి తల్లినీ చూస్తూ నిలిచిపోయాడు.

ఇదంతా చూసి పక పక నవ్వుతున్నట్టు, జయాటాకీసు వారి లౌడ్‌స్పీకరు బర్రు మంది.

1947 ఫిబ్రవరి ఆంధ్రశిల్పినుంచి

1‒12‒46 తేదీ నవోదయ సంచికలో ప్రకటిత మైన శ్రీ రాపూరి గోవిందాచారిగారి "కూటికోసం" అనే చిన్నకథ చదవగా, తోచిన కథ యిది.